



# విజయభాను

45 వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 10-02-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 121 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# రాజశ్యామలకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు

- విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలకు హాజరైన ముఖ్యమంత్రి
- పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్న సీఎం

**మూడున్నర గంటల పాటు వైదిక కార్యక్రమాల్లో**



విశాఖపట్నం/పెందుర్తి (విజయభాను న్యూస్): విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. సాంప్రదాయ కట్టుబట్టలతో విశేష పూజల్లో పాల్గొన్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సమక్షంలో రాజశ్యామల అమ్మవారి పూజలో పాల్గొన్నారు. మూడున్నర గంటలకు పైగా సమయాన్ని వైదిక కార్యక్రమాలకు కేటాయించారు. బుధవారం మధ్యాహ్నం 11.50 నిముషాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖ శ్రీ శారదాపీఠానికి చేరుకున్నారు. తొలుత పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అలాగే విజయ గణపతి, శంకరాచార్య, వనదుర్గ ప్రతిమలకు పూజలు చేసారు. అక్కడి నుంచి రాజశ్యామల అమ్మవారి ప్రత్యేక పూజ కోసం ఏర్పాటుచేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పండితులు సంకల్పం చెప్పించారు. అనంతరం కలశ స్థాపన చేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 45 నిముషాల పాటు



రాజశ్యామల అమ్మవారి పూజా కార్యక్రమం సాగింది. అనంతరం విశాఖ శ్రీ శారదాపీఠం నిర్వహణలోని జగద్గురు శంకరాచార్య వేద పాఠశాల పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు అందించారు. రుగ్వేదం, యజుర్వేదం, స్మార్తం విభాగాల్లో పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ పట్టాలను పొందారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మెడల్స్ వేసి సత్కరించారు. వార్షికోత్సవాలకు హాజరైన సీఎంకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి పట్టు వస్త్రాలను అందించి శాలువతో సత్కరించారు. అనంతరం తరువాయి 8లో..



## నేడు సీఎం జగన్‌తో సినీ పరిశ్రమ పెద్దల భేటీ

**సినిమా టికెట్ల రేట్లు ఫైనల్ కాలేదు**


**మంత్రి పేర్ని నాని**



తాడేపల్లి: సినీ పరిశ్రమ పెద్దలు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ కానున్నారని సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నాని తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చాలా మంది ప్రముఖులు కలవాలని అనుకున్నారని.. కోవిడ్ కారణంగా తక్కువ మందితో భేటీ జరగనున్నట్లు చెప్పారు. సినీ పరిశ్రమ సమస్యలపై సీఎం జగన్‌తో చర్చించనున్నారని.. సినిమా టికెట్ల రేట్లు ఫైనల్ కాలేదని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌తో మంత్రి పేర్ని నాని భేటీ కానున్నారు. నేడు టాలీవుడ్‌కు చెందిన సినీ పెద్దలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున అక్కినేనితో పాటు పలువురు ప్రముఖు సీఎం జగన్‌ను కలిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పేర్ని నాని సీఎం జగన్‌ను కలిసి కమిటీ నిర్ణయాలను వివరించనున్నారు.

## ఏపీకి ఆత్మనిర్భరత ఏది?

**కేంద్ర బడ్జెట్‌ను దుయ్యబట్టిన విజయసాయి రెడ్డి**



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్‌పై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్భాటం తప్ప విషయం లేదని విమర్శించారు. ఈ బడ్జెట్ ఆపరేషన్ సక్సెస్...కానీ పేషెంట్ డెడ్ అన్నట్లుందని వ్యాఖ్యానించారు. ఇది ఉత్తరప్రదేశ్, పంజాబ్ బడ్జెట్ అవుతుందేమోనని ఊహించాం. కానీ బడ్జెట్ ప్రసంగం విన్న తర్వాత ఇది ఏ రాష్ట్రానికి చెందని బడ్జెట్ అని తేలిపోయిందన్నారు.

**రాష్ట్రాలకు ఆత్మనిర్భరత ఎక్కడ?**

విజయసాయి రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ గురించి మాట్లాడుతోంది. మరి రాష్ట్రాల ఆత్మనిర్భరత ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర పన్నులలో రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన వాటాను కేంద్రం తన హస్తలాఘవం ప్రయోగించి దారుణంగా తగ్గించిందని దుయ్యబట్టారు. బడ్జెట్ అంకెల ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్థూల పన్నుల ఆదాయంలో ఉద్దేశపూర్వకంగానే సెస్సులు, సర్‌చార్జీలను పెంచుకుంటూ పోయిందని అన్నారు. సెస్సులు, సర్ చార్జీల పేరిట వచ్చే ఆదాయంలో నయా పైసా వాటా కూడా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన అవసరం లేనందునే కేంద్రం దొడ్డిదారిలో ఈ పని చేస్తున్నదని అన్నారు. కేంద్రానికి వచ్చే స్థూల పన్నుల ఆదాయంలో డివిజబుల్ పూల్ కింద రాష్ట్రాలకు 41 శాతం వాటాను పంపిణీ చేయాలని 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. అయితే సెస్సులు, సర్‌చార్జీల పేరిట కేంద్రం వసూలు చేసే పన్నులు డివిజబుల్ పూల్ కిందకు రావు. ఫలితంగా డివిజబుల్ పూల్‌లో జమయ్యే స్థూల పన్నుల ఆదాయం గణనీయంగా తగ్గింది. దీని పర్యవసానంగా ఆంధ్రప్రదేశ్‌కు పన్నుల పంపిణీలో దక్కాల్సిన వాటా 41 శాతానికి బదులు 29 శాతానికి పడిపోయిందని శ్రీ విజయసాయి రెడ్డి వివరించారు.

**పెట్రోల్, డీజిల్ సెస్సులో రాష్ట్రాలకు ఇచ్చిందెంత?**

పెట్రోల్, డీజిల్‌పై విధించిన సెస్సు ద్వారా కేంద్ర ప్రభుత్వం 3 లక్షల తరువాయి 2లో..




# ఏపీకి ప్రత్యేక హోదా హామీని కేంద్రం నెరవేర్చాలి

**: వైఎస్సార్‌సీపీ ఎంపీలు**



న్యూఢిల్లీ: ఏపీకి ప్రత్యేక హెూదా హామీని కేంద్రం నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలు అన్నారు. బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో ఎంపీలు మార్గాని భరత్, లావు శ్రీకృష్ణదేవరాయలు, నందిగం సురేష్ మాట్లాడారు. ఏపీకి కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని బీజేపీ సరిదిద్దాలని.. ఏపీ విభజన హామీలపై 8 ఏళ్లుగా పోరాడుతున్నామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కేంద్రం గతీ శక్తీ అంటూ కొత్త కథలు చెబుతోందని మండిపడ్డారు. గతీశక్తి పథకం నిధులను ఏపీ విభజన హామీలకు ఖర్చు చేయాలన్నారు. బడ్జెట్ కేవలం గణాంకాల గారడీ విద్యేనన్నారు.

"కేంద్ర బడ్జెట్ నిరాశపరిచింది. కేంద్ర బడ్జెట్ పేదలు, రైతులకు వ్యతిరేకం. ఫెర్టిలైజర్స్ సబ్సిడీని 25 శాతం తగ్గించి రైతులకు అన్యాయం చేశారు. పీఎం గరిబ్ అన్న యోజన పథకం ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. ఉపాధి తరువాయి 2లో..

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యునిగా 66వ వార్డు వైస్సార్సీపీ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ప్రమాణ స్వీకారం



గాజువాక : (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యునిగా 66వ వార్డు వైస్సార్సీపీ కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ ప్రమాణస్వీకారం చేసారు. రాష్ట్ర మైనార్టీ హజ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.16 మంది సభ్యులతో విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ భవనంలో నూతన కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిసేసింది. ఉత్తరాంధ్ర జిల్లా నుండి వైస్సార్సీపీ నాయకుడు జీవీఎంసీ 66వ వార్డు కార్పొరేటర్,జీవీఎంసీ విప్ మెంబెర్ మహ్మద్ ఇమ్రాన్ కమిటీ సభ్యునిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసారు. ఈ సందర్బంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ,ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ,రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి,గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేస్తూ నా బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని అలాగే నాకు అవకాశం కలగడానికి కార్పొరేటర్ హోదా కల్పించిన 66వ వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఇమ్రాన్ మైనార్టీ హజ్ కమిటీ పెద్దల సమక్షంలో శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు షఫీ,షోయబ్, జహీర్, దేముడుబాబు, సైఫ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుడి జన్మవృత్తాంతంపై పుస్తకం 16న తితిదే ఈవో కె.ఎస్.జవహర్‌రెడ్డి వెల్లడి

తిరుమల : తిరుమల ఆకాశగంగ సమీపంలో శ్రీఆంజనేయస్వామివారి జన్మవృత్తాంతంపై ఈనెల 16న పుస్తకాన్ని ఆవిష్కరించనున్నామని తితిదే ఈవో కె.ఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. అదే రోజు అంజనాద్రిలో హనుమంతుడి జన్మస్థలం వద్ద చేపట్టే అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తామని వెల్లడించారు. భూమిపూజ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతాన్ని పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అంజనాదేవి, బాలఆంజనేయస్వామివారి ఆలయం ఎదురుగా ముఖమండపం, గోపురాలు నిర్మిస్తామన్నారు. తితిదే పాలకమండలి మాజీ సభ్యులు నాగేశ్వరరావు, మురళీకృష్ణ ఆర్థికసాయంతో ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు వివరించారు. తరిగొండ వెంగమాంబ బృందావనంలోని ఎకరన్నర స్థలంలో ధ్యానమందిరం, ఉద్యానవనం నిర్మాణానికి కార్యాచరణ రూపొందించి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నామన్నారు.

## యూనిఫామ్స్ డస్ట్‌బిన్‌లు పంపిణీ చేసిన ఎంపీపీ



వి మాడుగుల (విజయభాను న్యూస్) : మండలంలోని మాడుగుల ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రామ ధర్మ చేతులమీదుగా యూనిఫాంలు, డస్ట్ బిన్ లు పంపిణీ చేశారు. ఎంపీడీవో పోలి నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని 23 సచివాలయంలో పనిచేస్తున్న 142 సిబ్బందికి యూనిఫామ్ లు అలాగే 234 బెస్టిబిన్ లను 29పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అనంతపురం సెంట్రల్ వర్సిటీకి 31 కోట్లు



న్యూఢిల్లీ : అనంతపురంలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు 31.24 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు విద్యా శాఖ సహాయ మంత్రి సుభాస్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో బుధవారం విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్ నిర్మాణంపై సమర్పించిన డీపీఆర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 450 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ యూనివర్శిటీ గెస్ట్, విజిటింగ్ ఫ్యాకల్టీ ద్వారా నాలుగు అండర్ గ్రాడ్యుయేట్, ఏడు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## జూన్‌కల్లా ఆనందపురం-అనకాపల్లి హైవే రెడీ

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ నాటికి ఆనందపురం-పెందుర్తి-అనకాపల్లి మధ్య నిర్మిస్తున్న 6 లేన్ల జాతీయ రహదారి పూర్తవుతుందని జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ 2527 కోట్ల రూపాయల వ్యయంతో సుమారు 50 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ ఆరు వరసల జాతీయ రహదారి 2019 ఏప్రిల్‌లో ప్రారంభమైనట్లు చెప్పారు.

వాస్తవానికి ఈ రహదారి నిర్మాణం 2021 జూలై నాటికి పూర్తి కావలసి ఉన్నప్పటికీ కోవిడ్ మహమ్మారి కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని అయితే దీని వలన ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం లేదని తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించండి

### - ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలకృష్ణ..



పాడేరు: (విజయభాను న్యూస్) : : గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ ఆదేశించారు. గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు యూనిఫారం, జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. 9 ,10 తరగతుల ను సందర్శించి విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. వంద రోజుల విద్యా ప్రణాళిక ను పరిశీలించారు. వందరోజుల విద్యా ప్రణాళిక కు సమర్థవంతంగా అమలు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు ,మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన మెనూ అమలు చేయాలన్నారు. పాఠశాల సమస్యలపై ఆరా తీశారు.

## అనధికార భూ ధృవీకరణ పత్రాల పట్ల కఠినంగా వ్యవహరించాలి




శ్రీకాకుళం : పునరావాస కాలనీల్లో అనధికార ధృవీకరణ పత్రాలు పట్ల ధృడంగా వ్యవహరించాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వంశధార, జలవనరుల ప్రాజెక్ట్ ల పునరావాస పనులపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశలో స్పీకర్ పాల్గొన్నారు. విశ్రాంత తహశీల్దార్లు పట్టాలు జారీ చేస్తున్నారని సమాచారం ఉందని తద్వారా భవిష్యత్తులో శాంతి భద్రతల సమస్య తలెత్తినా ఆశ్చర్యం లేదని ఆయన పేర్కొన్నారు. బోగస్ పట్టాలు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బోగస్ వ్యక్తులు స్థలాలు స్వాధీనం చేసుకోకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన సూచించారు. భూముల కొనుగోలు, అమ్మకాల పట్ల రాజకీయ పలుకుబడి ఉపయోగించే వారిపైనా కఠినంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. పునరావాస ప్యాకేజీ క్రింద స్థలం, నగదు ప్యాకేజీ ప్రభుత్వం ప్రకటించిందని వాటికి సంబంధించిన పునరావాసానికి సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండాలని వాటిని సమర్పించాలని ఆయన ఆదేశించారు. ప్యాకేజీ సక్రమంగా అందిందా లేదా అనే అంశం పరిశీలించాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడు కోవలసిన బాధ్యత ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ట్రస్టీలుగా ఉండాలని ఆయన అన్నారు. ఆక్రమణదారుల పట్ల ఉదాసీనత వద్దని ఆయన సూచించారు. భూ మాఫియా సమాంతర ప్రభుత్వం నడిపే స్థాయికి చేరుతున్నాయని, ప్రభుత్వ భూములు ఆక్రమించి ఉన్నత అధికారుల పై కోర్టులకు వెళుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెందిన భూములు అని రికార్డులు చూపిస్తుండగా కొంత మంది కోర్టుకు వెళుతున్నారని ఆయన అన్నారు. తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అధికార యంత్రాంగంను సవాలు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పునరావాస కాలనీల వ్యవహారం తీవ్రంగా తీసుకోవాలని ఆయన అన్నారు. స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జాయింట్ కలెక్టర్ ను ఆదేశించారు. వంశధార పూర్తి చేయడం వల్ల 15 సంవత్సరాలలో శ్రీకాకుళం జిల్లా రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అవతరించ గలదని ఆయన అన్నారు. ఉత్పాదకతకు అనుగుణంగా మిల్లులు, గిడ్డంగులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు పెద్ద స్థాయిలో రావలసి ఉందని చెప్పారు. జిల్లాలో పలు ఆలయాల భూములు, మందస పద్మనాభ స్వామి దేవాలయం భూముల ఆక్రమణలపై దృష్టి సారించాలని దేవదాయ శాఖ సహాయ కమీషనర్ ను ఆదేశించారు. ఉదాసీనత వద్దని ఆయన సూచించారు. వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోలా తిరుమల రావు మాట్లాడుతూ వంశధార మూడు ప్యాకేజీలు 85 శాతంకు పైగా పనులు పూర్తి అయ్యాయని చెప్పారు.

నాలుగు ప్యాకేజీలకు సంబంధించి రూ.62 కోట్లు, భూ సేకరణకు రూ.10 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. విజయ సునీత, రెవిన్యూ డివిజనల్ అధికారి టి.వి.ఎస్.జి.కుమార్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలక్టర్లు బి.శాంతి, పి.అప్పారావు, రవి జోసెఫ్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ సుధాకర రావు, కార్యనిర్వాహణ ఇంజినీర్లు డి.శ్రీనివాస్, రామచంద్ర రావు,ఎం.వి.రమణ, అప్పల నాయుడు, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ కె.శిరీష, రెవిన్యూ, జలవనరుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఏపీకి ఆత్మనిర్భరత ఏది?

35 వేల కోట్ల రూపాయల రెవెన్యూ ఆర్జించింది. ఈ మొత్తం ఆదాయంలో అన్ని రాష్ట్రాలకు కలిపి ఇచ్చింది కేవలం 5.8 శాతం...అంటే 19,475 కోట్ల రూపాయలు మాత్రమేనని శ్రీ విజయసాయి రెడ్డి చెప్పారు. ఇది కాకుండా పెట్రోల్, డీజిల్‌పై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ పేరుతో కేంద్ర ప్రభుత్వం మరో 2 లక్షల 87 వేల కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇందులో ఒక్క రూపాయి కూడా రాష్ట్రాలకు ఇవ్వలేదు. ఎక్సైజ్ డ్యూటీ కింద రాష్ట్రాలకు వచ్చే ఆదాయంలో పెట్రోల్‌పై 40 శాతం, డీజిల్‌పై 59 శాతం తగ్గిపోయింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై 85 శాతంపైనే ఎక్సైజ్ డ్యూటీని సెస్ రూపంలో వసూలు చేస్తోంది. ఇందులో రాష్ట్రాలకు ఒక్క రూపాయి కూడా దక్కదని అన్నారు. లీటర్ పెట్రోల్ ధర వంద రూపాయలు ఉంటే అందులో స్పెషల్ ఎక్సైజ్ డ్యూటీ కింద 11 రూపాయలు, రోడ్లు, మౌలికవసతుల సెస్ కింద 18 రూపాయలు, వ్యవసాయ మౌలిక వసతుల కల్పన సెస్ కింద 2 రూపాయల 50 పైసలు మొత్తంగా 31.5 శాతం ఆదాయం కేంద్ర ప్రభుత్వానికే లభిస్తోంది. బేసిక్ ఎక్సైజ్ డ్యూటీ కింద వసూలు చేసే 1 రూపాయి 40 పైసలు మాత్రమే రాష్ట్రాలకు పంపిణీ అవుతోందని వి.విజయసాయి రెడ్డి గణాంకాలతో సహా వివరించారు.

**డివిజబుల్ పూల్‌లో తగ్గిపోతున్న ఏపీ వాటా**

కేంద్ర ప్రభుత్వం డివిజబుల్ పూల్ నుంచి రాష్ట్రాలకు పంపిణీ చేయవలసిన పన్నుల వాటాలో ఆంధ్రప్రదేశ్ వాటా నానాటికీ తగ్గిపోతున్నదని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు. 13వ ఆర్థిక సంఘం (2010-15) సిఫార్సుల ప్రకారం డివిజబుల్ పూల్‌లో ఆంధ్రప్రదేశ్ వాటాను 6.9 శాతంగా నిర్ధారించగా, 14వ ఆర్థిక సంఘం (2015-20) దానిని 4.3 శాతానికి తగ్గించింది. అంటే 2.6 శాతం తగ్గింది. 15వ ఆర్థిక సంఘం (2021-2026) సిఫార్సుల ప్రకారం డివిజబుల్ పూల్‌లో ఏపీ వాటా 4.1 శాతానికి పడిపోయిందని ఆయన వివరించారు.

డివిజబుల్ పూల్‌లో రాష్ట్రాల వాటాను సిఫార్సు చేయడానికి ఆర్థిక సంఘం పాటించే ప్రామాణికాలలో రాష్ట్ర జనాభా ఒకటి. దాని ప్రకారం అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు డివిజబుల్ పూల్‌లో అధిక వాటాను పొందుతుంటే జనాభా నియంత్రణ కోసం పని చేసే రాష్ట్రాలకు తక్కువ వాటా ఇచ్చి వాటిని శిక్షిస్తున్నారని ఆయన విమర్శించారు. ఒక వైపు సెస్సులు, సర్ చార్జీల పేరుతో కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వసూలు చేసే పన్నులతో డివిజబుల్ పూల్‌లో జమ అయ్యే స్థూల ఆదాయం మొత్తం క్షీణిస్తుంటే మరోవైపు ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా డివిజబుల్ పూల్ నుంచి వచ్చే ఆంధ్రప్రదేశ్ ఆదాయం క్రమేపీ తగ్గిపోతూ వస్తోందని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు.

**ఏపీ, కేంద్ర బడ్జెట్ మధ్య తేడా చూడండి**

సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు జరపడాన్ని శ్రీ విజయసాయి రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులకు కేంద్ర బడ్జెట్ కేటాయింపులతో పోల్చారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఆర్థిక అరాచకానికి పాల్పడినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆదర్శనీయమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని చెప్పారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో వ్యవసాయానికి 5.9 శాతం నిధులు కేటాయిస్తే, 2022-23 బడ్జెట్‌లో కేంద్రం 3.8 శాతం కేటాయించింది. విద్యా రంగానికి ఏపీ 11.8 శాతం నిధులను కేటాయిస్తే కేంద్ర బడ్జెట్‌లో అది కేవలం 2.6 శాతం మాత్రమే ఉంది. ఆరోగ్య రంగానికి ఏపీ బడ్జెట్‌లో 6.0 శాతం కేటాయిస్తే కేంద్ర బడ్జెట్‌లో 2.2 శాతం, గ్రామీణాభివృద్ధికి ఏపీ 7.1 శాతం నిధులు ఇస్తే కేంద్రం 5.2 శాతం, సామాజిక సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో 12.1 శాతం నిధుల కేటాయింపు జరగ్గా కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అది కేవలం 1.3 శాతం మాత్రమే ఉందని వివరించారు.

కేంద్రం ఆంధ్రప్రదేశ్ పట్ల అనుసరిస్తున్న సవతి తల్లి వైఖరి ఒకవైపు, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు మరోవైపు ఉన్నప్పటికీ వ్యవసాయం, విద్యా, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం...ఇలా కీలకమైన అన్ని రంగాలలోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కంటే మిన్నగా నిధులను ఖర్చు చేస్తోందని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు.

**మధ్యతరగతికి ఊరట లేని బడ్జెట్**

కేంద్ర పన్నుల ఆదాయంలో 10 శాతం పెరుగుదల నమోదైనప్పటికీ బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ఊరట కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. ఒకవైపు ద్రవ్యోల్బణం ఎన్నడూ లేనంతగా పెరిగినప్పటికీ ఆదాయ పన్ను శ్లాబులలో ఎలాంటి మార్పు చేయనందున మధ్య తరగతి ప్రజల మిగులు ఆదాయం తగ్గిపోయిందని అన్నారు. ఆదాయపన్నులో 2.5 లక్షల మినహాయింపు అనేది 2014 నుంచి 2022 వరకు కొనసాగుతూనే ఉంది. ద్రవ్యోల్బణం మాత్రం 48 శాతం పెరిగిందని అన్నారు. 2014 నాటి ధరలకు ఇప్పటి ధరలకు ఎంతో వ్యత్యాసం ఉన్నప్పటికీ టాక్స్ శ్లాబ్స్‌లో మాత్రం ఎలాంటి మార్పు చేయకపోవడం తగదని చెప్పారు. మధ్య తరగతి ప్రజల పరిస్థితిని అర్థం చేసుకుని టాక్స్ రేట్ శ్లాబ్స్‌ను హేతుబద్ధీకరణ చేయాలి. పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఐటీ డిడక్షన్లు, మినహాయింపులు చేయాలని ఆయన ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్‌ను సులభతరం చేయాలి**

ప్రస్తుతం ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలంటే పన్ను చెల్లించేవారు ముందుగా అయిదు రకాల డాక్యుమెంట్లను సమకూర్చుకోవాలి. ఇది చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. ఉద్యోగి తన సంస్థ నుంచి ఫార్మ్ 16 సేకరించాలి. బ్యాంకులు లేదా పోస్టాఫీసుల నుంచి ఫార్మ్ 16ఏ, ఇతరత్రా ఆదాయం ఉంటే దానికి సంబంధించిన టీడీఎస్ సర్టిఫికెట్లు, ఫార్మ్ 26ఏఎస్, టాక్స్ సేవింగ్ ఇన్వెస్టిమెట్లను ధృవపరచే సాక్ష్యాలను సమర్పించాలి. వీటన్నింటినీ సమగ్రగా ఒకే ఐటీ ఫార్మ్ ద్వారా ఫైల్ చేసే వెసులుబాటు పన్ను చెల్లింపుదారుడికి కల్పించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

ఐటీ పోర్టల్‌లో లోపాలు సరిదిద్దాలి

రిటర్న్‌లు ఫైల్ చేయాడానికి నిర్దేశించిన ఇన్‌కం టాక్స్ పోర్టల్‌లో లోపాలు, అవాంతరాలు ఎదురవుతున్నట్లు లక్షలాది మంది పన్ను చెల్లింపుదార్లు అనేక నెలలుగా ఫిర్యాదు చేస్తున్నారు. వీటిని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వం రిటర్న్ దాఖలు చేసే గడువును దఫదఫాలుగా పెంచుకుంటూ పోతోందని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు.

**సబ్సిడీలకు అడ్డగోలు కోతలు**

ఒకవైపు ధరలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని ప్రధానమైన సబ్సిడీలపై గణనీయంగా కోతలు పెట్టింది. కరోనా మహమ్మారి కాలంలో ఎవరినీ పస్తులు ఉండనీయబోమని చెప్పే ప్రభుత్వం బడ్జెట్‌లో ఆహార సబ్సిడీని 28 శాతానికి తగ్గించిందని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు. అలాగే ఎరువుల ధరలు పెరిగి రైతులు అల్లాడిపోతుంటే మరోవైపు కేంద్రం ఎరువుల సబ్సిడీని 25 శాతానికి తగ్గించింది. లక్షలాది కుటుంబాలు వినియోగించే ఎల్పీజీ సిలండర్లపై సబ్సిడీని 11 శాతానికి పరిమితం చేసిందని ఆయన విమర్శించారు.

**నెరవేరని కేంద్ర ప్రభుత్వ హామీలు**

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద ఇచ్చిన ప్రధాన హామీలైన వైజాగ్ రైల్వే జోన్, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు, కాకినాడ పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ ఏడేళ్ళు పూర్తయినా కార్యరూపం దాల్చకుండా ఇంకా హామీలుగానే మిగిలిపోయాయని శ్రీ విజయసాయి రెడ్డి అన్నారు.

అలాగే విభజన చట్టంలో పొందుపరచిన జాతీయ ప్రాధాన్యం కలిగిన విద్యా సంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ-వైజాగ్, ఐఐఎం-వైజాగ్, ఐఐటీ-తిరుపతి, సెంట్రల్ యూనివర్శిటీ, సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ ఇప్పటికీ చాలీచాలని వసతి, సౌకర్యాలతో తాత్కాలిక క్యాంపస్‌లలోనే నడుస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై అదే పనిగా విమర్శలు గుప్పించే బీజేపీ రాష్ట్ర నాయకత్వం కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయం పట్ల మాత్రం నోరు ఎందుకు విప్పదని ఆయన ప్రశ్నించారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, ఔర్ సబ్‌కా ప్రయాస్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం చివరకు ఈ బడ్జెట్ ద్వారా వట్టిదే అని తేలిందని విజయసాయి రెడ్డి అన్నారు.

## ఏపీకి ప్రత్యేక హోదా హామీని కేంద్రం నెరవేర్చాలి

హామీ పథకానికి కూడా బడ్జెట్ కేటాయింపులు తగ్గించారు. గ్రామీణాభివృద్ధి పథకాలకు కేటాయింపులు తగ్గించారు. స్వయం సహాయక పథకాలకూ బడ్జెట్‌లో నిధులు తగ్గించారు. కరోనా సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరేలా బడ్జెట్ ఉండాలని నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ కూడా సూచించారు.

# విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలి

## నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోరాడ రాజబాబు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక చిన్నబజార్ టీడీపీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ భీమిలి నియోజకవర్గ నూతన కమిటీని నియోజకవర్గ ఇన్ చార్జ్ మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోరాడ రాజబాబు ప్రకటించారు.తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి విభాగాన్ని ఉద్దేశించి రాజబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలని క్రమశిక్షణ పట్టుదల సేవా దృక్పథం కలిగి ఉన్నప్పుడే సరైన నాయకత్వ లక్షణాలు అవలంబిస్తానని ప్రతి టీఎన్ఎస్ఎఫ్ లో ఉన్న ప్రతి సభ్యుడు వంద మంది విద్యార్థులతో సమానం కావాలని అలా ఒకరినొకరు కలుపుకుంటూ విద్యార్థి విద్యార్థి విభాగాన్ని దృఢపరచు కుంటూ తెలుగుదేశం పార్టీని సీనియర్ నాయకులను ఉపయోగించుకుని స్టూడెంట్ విభాగాన్ని బలపరచాలని అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ సభ్యులందరికీ కండువాలు వేసి కమిటీని ప్రకటించారు. కమిటీలో ప్రెసిడెంట్ బోని సురేష్, వైస్ ప్రెసిడెంట్ లు నాగిరెడ్ల హరీష్ రెడ్డి, కంటుబోతు సుమంత్ నాయుడు, బోర సూర్య భాస్కర్, జనరల్ సెక్రెటరీ కోరాడ వైకుంఠం, అధికార ప్రతినిధులు కొప్పల అశోక్ కుమార్ ,శినగం షామీ నాయుడు ,ఆర్గనైజింగ్ సెక్రటరీ లు అవనాపు రవి చరణ్ ,మురిపాల భాను ప్రకాష్ , కాశరాపు శ్రీనివాస రావు, నీలాద్రి నర్సింగ్ రావు, కోరాడ వెంకటేష్, సెక్రటరీలు దువ్వు చాందిని, బసన అప్పలరాజు, పతివాడ శ్రీను, దేవాడ రాంబాబు ,ముగడ ఎర్రయ్య ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ పీసా వెంకటేష్, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దెల గురుమూర్తి (దేవుళ్ళు), నరవ రామారావు, కనకల అప్పల్ నాయుడు, మారోజు సంజీవ్ కుమార్, కాసరపు. ఎల్లాజీ ,అరసవిల్లి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అరుకు ని అన్ని విధాలుగా అన్యాయం





అరకులోయ (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలో అరకు జిల్లా సాధన సమితి ఆధ్వ ర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎస్ టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు. అరకు జిల్లా సాధన సమితి పొలిటికల్ వింగ్ కన్వీనర్ సివేరి దొన్నుదొర మాట్లాడుతు ప్రస్తుత పాలకవర్గంలో ఉన్న పాలకులు అరకుకు అన్ని విధాల అన్యాయం చేశారన్నారు. మన పాలకుల చేతగానితనం వలన పాడేరులో మెడికల్ కాలేజీ, పార్వతీపురంలో ఇంజినీరింగ్ కాలేజ్ విజయ నగరంలో గిరిజన విశ్వవిద్యాలయం, ఇప్పుడు అరకు జిల్లా పాడేరుకు తరలి పోవడానికి కారణం మనరు అసమర్థత ఎమ్మెల్యే అలాగే యం పి లు. కావున విద్యార్థులారా మన రేపటి భవిష్యత్ కొరకు అరకు జిల్లా సాధనకై మనందరు కలిసి సైనికులుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అరకుజిల్లా సాధన సమితి చైర్మన్ బస్కిబారికి నాగేష్, బిజెపి అరకు జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు,అరకు జెడ్ పి టి సి రోషిణిఅశోక్, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టేలీ దాసుబాబు,బిజెపి అరకువేలీ నియోజకవర్గ కన్వీనర్ వంతల రామచందర్, పెదలబుడు ఎంపిటిసి దురియా ఆనంద్, వైసిపి నాయకులు అశోక్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న

## నర్సీపట్నం క్రైమ్ స్పాట్స్ ఇంఛార్జ్ కె.శ్రీనివాసరావు



నర్సీపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నం జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ మరియు నర్సీపట్నం ఏయస్పీ అదేశాల మేరకు నర్సీపట్నం క్రైమ్ స్పాట్స్ ఇంచార్జ్ కె.శ్రీనివాసరావు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూన్నారు. ఇందులో భాగంగా నర్సీపట్నం రూరల్ పరిధి వేములపూడి లో కస్తూరి బా గాంధీ బాలికల విద్యా లయంలో కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో 1సైబర్ క్రైమ్ 2. ముందస్తు జాగ్రత్తలు దొంగ తనాలు జరగకుండా 3 నేరస్థలం పర్యరక్షణ 4 దిశ యాప్ ఉపయోగాలు 5 మైనర్ డ్రైవింగ్ 6 ఈవ్ టీజింగ్ 7 మహిళ చట్టాలు 8. ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నబర్స్ పై వీడియోలు, కర పత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ లో విద్యాలయం ప్రిన్సిపల్ కే. భవాని క్లూస్ టీం సిబ్బంది, నాని, యుగంధర రావు ,మహిళ పోలీస్ సోమిదేవి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ గ్రామ రెవెన్యూ సహాయక సంఘం ఆధ్వర్యంలో వీఆర్ఏ లు ఆందోళన



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : గ్రామ రెవెన్యూ సహాయకుల కు కనీస వేతనం రూ. 21,000 ఇవ్వాలని, నామినీలను విఆర్ఏ లుగా నియమించాలనీ బుధవారం స్థానిక మండల కార్యాలయం నందు ఎపి గ్రామ రెవెన్యూ సహాయక సంఘం ఆధ్వర్యంలో విఆర్ఏ లు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బాందేపురపు సూరిబాబు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి వీఆర్ఏలకు న్యాయం చేస్తానని చెప్పి ఇంతవరకూ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కేవలం రూ.10,500 మాత్రమే విఆర్ఏలు కు ఇస్తున్నారనీ అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పిఆర్సి సందర్భంగానే రాష్ట్రంలోని వీఆర్ఏలకు 30 శాతం వేతనం పెంచిందని, కానీ మన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించి ముందుకు రాకపోవడం బాధా కరమని అన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో గత్యంతరంలేక ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ వ్యవస్థలో 20 వేలకు పైగా వీఆర్ఏలు ఉన్నారని, వారి వేతనాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల కనీస వేతనం రూ. 21000 ఇవ్వాలని, డిఎ తో కలిపి వేతనం చెల్లించా లని, నామినీలను విఆర్ఏలుగా నిరమించాలనీ, అర్హులైనవారికి ప్రమోషన్ ఇవ్వాలని ,65 సంవత్సరాలు దాటి చనిపోయిన విఆర్ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే డిమాండ్ సాధనకోసం ఈ నెల 22వ తేదీ వరకు మండల కేంద్రాల్లో దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాములప్పడు, ఎస్.అప్పారావు, ఎస్ నర్సింగరావు, విఆర్ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం..




పాడేరు (విజయభాను న్యూస్) : గిరిజన సంక్షేమ శాఖ, ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ గురుకుల వారి ఆధ్వర్యంలో 2022-2023 విద్యా సంవత్సరం నుండి ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ పాఠశాల బాలురు సీతంపేట ,శ్రీకాకుళం నందు ,బాలికలకు ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ పాఠశాల బాలికలు భద్రగిరి, విజయనగరం నందు క్రీడా పాఠశాల ప్రారంభించబడుతుందని ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డా. రమేష్ తెలిపారు. పాఠశాలలో ప్రవేశమునకు ఈ నెల 10వ తేదీన బాలురు సీతంపేట ,11వ తేదీన బాలికలకు భద్రగిరి లో శరీర దృఢ పరీక్షలు నిర్వహించబడుతుందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలియజేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులు దీనికి అర్హులని తెలిపారు. బాలురు విలువిద్య, కబాడీ అతల్ టీక్స్ ,హ్యాండ్ బాల్ వాలీబాల్, బాలికలకు అతల్ టీక్స్, కోకో ,కబాడీ ,వాలీబాల్ తదితర ఆటలలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ పథకం నిర్వాహక అధికారి స్థానిక ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ వెల్లడించారు.

# ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్థాయి గాయనీ గాయకులకు

## విశాఖ జిల్లా సింగర్స్ అసోసియేషన్ అన్ని విధాలా అండగా ఉంటుంది

## అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జామి శివ అప్పల రాజు(సింగర్ రాజు)



విశాఖపట్నం (విజయ భాను న్యూస్) : ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్న స్థాయి గాయనీ గాయకులకు విశాఖ జిల్లా సింగర్స్ అసోసియేషన్ అన్ని విధాలా అండగా ఉంటుం దని అసోసియేషన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు జామి శివ అప్పల రాజు(సింగర్ రాజు) చెప్పారు. అసోసియేషన్ ఆధ్వ ర్యంలో మంగళవారం వైశాఖి జల ఉద్యానవనంలో నిర్వ హించిన ఆత్మీయ సమా వేశంలో అయన మాట్లాడుతూ అసోసియేషన్ లో సభ్యత్వం కలిగిన ప్రతీ సింగర్ కు పది లక్షల రూపాయల ప్రమాదబీమా, రెండులక్షల రూపాయల ఆరోగ్యబీమా తన సొంత నిధులతో ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.ప్రతీ ఏటా అసోసియేషన్ ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. 298 గాయనీ గాయకులకు అసోసియేషన్ సహాయం చేసిందని తెలిపారు. కళాకారులందరికీ గుర్తింపుకార్డుల మంజూరుకు, ప్రభుత్వ రాయితీల కోసం అసోసియేషన్ కృషిచేస్తుందని హామీ ఇచ్చారు. ఇటీవల మరణించిన ప్రముఖ ఆర్కెస్ట్రా లో గాయకుడు వాసుపల్లి చిట్టిబాబు కుటుంబానికి అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం చేసినట్లు రాజు తెలిపారు.వీఎమ్ఆర్డీఏ సీఏఓ నిర్మల,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సీతారామరాజు, సతీష్ కుమార్ వర్మ,సత్తి విశ్వేశ్వర రెడ్డి,దర్శకుడు యాద కుమార్,జబర్దస్త్ ప్రకాష్ తదితర ప్రముఖులు హాజరై నిర్వాహకులను అభినందించారు.అనంతరం అతిథుల చేతుల మీదుగా సభ్యులకు ఇన్సూరెన్స్ బ్యాండ్ లను అందచేశారు.ఈ కార్యక్రమంలో వీ.ఎన్.మూర్తి,పక్కి చందు,ఎస్.మురళి,పల్లా వెంకటేష్, భీశెట్టి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో నీను సైతం అంటున్న డా.చింతకాయల

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీలోఎప్పటి నుండో ముత్యాలమ్మ పాలెం ,దిబ్బపాలెం గ్రామాలలో డ్రెయినేజీ లు లేకపోవడం వలన రోడ్డుల మీదుగా నీరు పారడం వీదులు అన్ని శుభ్రంగా లేకపోవటంతో స్పందించిన గ్రామ సర్పంచ్ డా''చింతకాయల సూజాత ముత్యాలు గ్రామాలలో ముఖ్యంగా దిబ్బపాలెంలో రోడ్డులు చుట్టు కాలువలు అలాగే వీదులలో కాలువలు వేయడానికి ఈవేళ పూనుకున్నారు. శరవేగంగా దిబ్బపాలెం గ్రామంలో ముత్యాలమ్మపాలెం పంచాయతీ లో రోడ్డులు కాలువలు నిర్మాణం జరుగుతుంది. పారిశుధ్యం మెరుగుపరచడం లోభాగంగా గ్రామ శుభ్రత లో భాగంగా చెస్తూన్నారు దగ్గర వుండి గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న పర్యవేక్షణలో జరుగుతుంది.అనంతరము స్దానిక విలేఖర్లుతో సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మాట్లడుతూ గ్రామాభివృద్దిలో నీను సైతం అంటూ గ్రామాల్లో ఉన్న సమస్యలునూ పరిష్కరమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అన్నారు.స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ సహకారముతో పంచాయితీని అభివృద్దిచేసి చూపిస్తామనీ ఈసందర్భంగా సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు తెలియపరిచారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసి చింతకాయల అమ్మోరు, బుజ్జి ,వైస్ ప్రెసిడెంట్ సూరాడ నూకమ్మ పెంటయ్య ,మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, దూడ సోమునాయుడు ,అర్జిల్లి అప్పారావు, చింతకాయల బాబూరావు, కణితి చినసోమేష్ , చింతకాయల అప్పలరాజు, చింతకాయల మసేను గ్రామ నాయకులు గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాడిరైతుల శ్రేయస్సు కోసం

# హెరిటేజ్ పలు సంక్షేమ పథకాలు

## మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : పాడిరైతుల శ్రేయస్సు కోసం హెరిటేజ్ డెయిరీ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని అచ్యుతాపురం శాఖ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు . బుధవారం ఎలమంచిలి మండలం పోతిరెడ్డి పాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడిరైతులతో కలిసి ఆయన హెరిటేజ్ అమలు చేస్తున్న పథకాల గొడపత్రికను విడుదల చేశారు. హెరిటేజ్ పాడిరైతుకు రాయితీపై కృత్రిమ గర్భధారణ రూ .50, అదేవిధంగా కృత్రిమ గర్భధారణ (ఆడ దూడ) రూ. 500 లకు పశు వైద్య సేవలు డెయిరీ అందిస్తున్నట్లు మేనేజర్ కూండ్రపు శేషు తెలిపారు . పాడిరైతులకు ప్రమాద భీమా, సబ్సిడిపై దాణా ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘ అధ్యక్షుడు ప్రసాద్, పాడిరైతులు రమణ, సన్యాసినాయుడు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విజయభాను

## సంపాదకీయం

### ఆవిష్కరణలతో నవీన ప్రపంచం

సెల్‌ఫోన్లతో సాంకేతిక విప్లవంలో దూసుకువెళ్తూ రిమోట్‌తో నడిచే కార్లను తయారుచేస్తూ అతి చిన్న శస్త్రచికిత్సలను చేసే రోబోలను సృష్టిస్తున్న మనిషి భవిష్యత్తులో మరింతగా కృత్రిమ మేధోసంపత్తి దిశగా అడుగులు వేయడం అనివార్య పరిణామమవుతుంది. అభివృద్ధి దిశలో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో దేశ భవిష్యత్తును రూపొందించడంలో నేటి విద్యార్థుల పాత్ర గణనీయమైనది. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశాన్ని అగ్రగామిగా ఉంచడంలో కీలకమవుతారు. మనిషి ఆలోచనలతో తన వలెనే ఆలోచించే మిషిన్లను తయారుచేస్తున్నాడు.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, విస్తరణలో కొత్త ఆవిష్కరణలు అతి ముఖ్యమైనవి. ఈ ఆవిష్కరణలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే మరిన్ని సత్ఫలితాలు సాధించవచ్చు. అనేక రకాల పరిశోధనలు, ప్రభుత్వాలు అవకాశాలను సృష్టించడం, సరైన గుర్తింపును కల్పించడం వల్లనే కృత్రిమ మేధస్సు అభివృద్ధి చెందింది. ప్రస్తుతం మహానగరాలు, నగరాలను దాటి గ్రామీణ ప్రజలు కూడా కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం ఫలితాలను చూస్తున్నారు. ఇదిప్పుడు చిన్న, పెద్ద వ్యత్యాసం లేకుండా అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్నది. హోటళ్లలో, రెస్టారెంట్లలో, ట్రాఫిక్ నియంత్రణలో, నిఘా పర్యవేక్షణలో వీటి ఉనికి నానాటికీ పెరిగిపోతున్నది. శాస్త్ర, సాంకేతికతల సహాయంతో ప్రపంచాన్నే గుప్పిట్లోకి తెచ్చిన శాస్త్రవేత్తల ఆవిష్కరణలు ప్రస్తుతం మానవ మేధస్సుకే సవాల్ చేసే స్థాయికి ఎదుగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదేమో. సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ కాలాన్ని శాసిస్తూ విప్లవాత్మకమైన మార్పులకు కృత్రిమ మేధస్సు దారితీస్తున్నది.

దేశ యువతరం నూతన ఒరవడితో ఎన్నో రకాలైన నూత్న యాప్స్‌ను సృష్టిస్తున్న కాలమిది. ఈ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి దేశ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం దేశ యువత సాంకేతిక విజ్ఞానంలో పదును పెడుతూ దేశంలో పేరుకుపోయిన ఎన్నో సమస్యలకు పరిష్కారమార్గాలను అన్వేషిస్తున్నది. విజయపథంలో సాగుతున్నది. సమస్యలకు నూతన పరిష్కారాలను అన్వేషించగల అసాధారణ సామర్థ్యం మన సొంతం. నూతన పోకడలకు తగ్గట్లుగా ఆలోచనాసరళికి పదును పెడుతూ అసాధ్యం అనిపించేటువంటి నిర్ణయాలను ఎలా తీసుకోవాలనేది మన చేతుల్లోనే ఉంది. ఆలోచనాసరళి మనకు సమస్యలను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను, సమస్యలను పరిష్కారం చేసే పద్ధతులను సూచిస్తుంది.

కరోనా కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సూక్ష్మ, స్థూల, మధ్యతరగతి పరిశ్రమ వర్గాలకు ఆత్మ నిర్భర్ భారత్ విశ్వాసాన్ని కల్పిస్తుంది. ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా అందిస్తున్న రుణాలు మైక్రో, స్మాల్ అండ్ మీడియం పరిశ్రమలకు ఎంతో మేలు చేస్తాయి. ఇలాంటి ప్రోత్సాహకాలతో మరిన్ని పరిశ్రమలు మరింతగా వెలుగులో కి రావడానికి అవకాశం ఉంటుంది. పారిశ్రామిక, శాస్త్రీయ, సాహిత్య, కళాత్మక రంగాలలో మేధో ఆవిష్కరణలకు మేధో సంపత్తి హక్కులు (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్- ఐపీఆర్) కీలకం. దీనివల్ల తమ సృష్టిపై ఆవిష్కర్తలకు కొన్ని ప్రత్యేక హక్కులుంటాయి. తద్వారా ఆవిష్కర్తలకు వారి పెట్టుబడుల నుంచి సహేతుకమైన రాబడి పొందే అవకాశాలు లభిస్తాయి.

పారిశ్రామిక, శాస్త్రీయ, సాహిత్య, కళాత్మక రంగాలలో మేధో ఆవిష్కరణలకు మేధో సంపత్తి హక్కులు (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్- ఐపీఆర్) కీలకం. దీనివల్ల తమ సృష్టిపై ఆవిష్కర్తలకు కొన్ని ప్రత్యేక హక్కులుంటాయి. తద్వారా ఆవిష్కర్తలకు వారి పెట్టుబడుల నుంచి సహేతుకమైన రాబడి పొందే అవకాశాలు లభిస్తాయి.

సమాజ ప్రయోజనాల కోసం సృజనాత్మక కార్యకలాపాలను ప్రోత్సహించడంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఎంతగానో దోహదపడతాయి. పేటెంట్ హోల్డర్ అనుమతి లేకుండా ఆవిష్కరణను వాణిజ్యపరంగా ఇతరులు కాపీ చేయడం కానీ, దొంగిలించడం కానీ చేయకుండా ఆవిష్కర్తకు హక్కు లభిస్తుంది. పేటెంట్ ఒక శక్తిమంతమైన వ్యాపార సాధనం. కొత్త ఉత్పత్తి లేదా ప్రక్రియపై ప్రత్యేకతను పొందటానికి, బలమైన మార్కెట్ స్థితిని అభివృద్ధి చేయడానికి, లైసెన్సింగ్ ద్వారా అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి ఆవిష్కర్తలను అనుమతిస్తుంది.

# రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన ఆక్వా ఉత్పత్తులు

- మత్స్యకారులకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం
- రైతులకు అందుబాటులో ఎరువులు
- ఉద్యోగాల కల్పనలో రికార్డు సృష్టించిన జగన్ ప్రభుత్వం
- అరుణాచల్ ప్రదేశ్ లో మృతిచెందిన వీర సైనికులు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయి రెడ్డి



విశాఖపట్నం (విజయభాను న్యూస్): రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్వా ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, 2014-15 నాటికి రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తి 103 లక్షల మెట్రిక్ టన్నులుంటే. 2020-21 నాటికి 150 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని అన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న అండదండలు, ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా యూరియా సహా అన్నిరకాల ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని. అన్ని రైతుభరోసా కేంద్రాలు, సహకార సొసైటీలు, మార్క్ ఫెడ్, రిటైల్, హోల్సేల్ డీలర్ల వద్ద ప్రస్తుత రబీకి అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రైతులు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.రబీ అవసరాలకు 23.45 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల పంపిణీ చేయడం జరిగిందని, ఆర్బికేలు, సహకార సొసైటీలు, మార్క్ ఫెడ్, రిటైల్, హోల్సేల్ డీలర్ల వద్ద 4.65 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2019 వరకు రాష్ట్రంలో 3.97 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఉండగా ఈ రెండేళ్లలోనే సీఎం జగన్ కొత్తగా 1,84,264 ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేసారు. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని పెద్దపెద్ద అక్షరాలతో రాస్తున్నవారికి, మాట్లాడుతున్నవాళ్లకి ఇవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 1.25 లక్షల మందికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, ఆర్టీసీ ఉద్యోగులు కన్న కలలను నెరవేరుస్తూ ఎ 51 వేల మందిని ప్రభుత్వంలో విలీనం చేయడం జరిగిందని గుర్తుచేసారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ సెక్టార్‌లో హిమపాతంలో చిక్కుకొని ఏడుగురు వీర సైనికుల మృతి చెందిన వార్త తనను తీవ్ర వేదనకు గురిచేసిందని. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నానని అన్నారు. ఫ్లోరోమెట్రిక్ విధానంలో వైరస్‌లను గుర్తించేందుకు అధునాతన సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధి చేసి జెఎన్ సి ఏ ఎస్ ఆర్ (జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్ డ్ సైంటిఫిక్ రీసెర్చ్) & ఐఐ ఎస్ సి (ఇండియన్ ఇన్టిస్ట్యూట్ ఆఫ్ సైన్స్) శాస్త్రవేత్తల బృందానికి ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలియజేసారు.వేగంగా పరివర్తన చెందుతున్న వ్యాధికారక క్రిముల యొక్క విపత్కర ప్రభావాల నేపధ్యంలో ఈ సాంకేతికతతో వైరస్ ను ఖచ్చితంగా గుర్తించి సకాలంలో చికిత్స అందించడంలో సహాయపడుతుందని అన్నారు. డిడియు జిజెవై (దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజన) వంటి ప్రజా సంక్షేమ పథకాలు లక్షలాది మందిని పేదరికం & అంధకారం నుండి బయటకు తేవడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

ఈ పథకం క్రింద దేశంలో దారిద్ర్య రేఖకు దిగువనున్న 1,27,68,620 కుటుంబాలకు విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌లు అందించామని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం తెలియజేసినందుకు సంతోషంగా ఉందని అన్నారు. భారతదేశం ఎగుమతి రంగంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ట్రాక్టర్లు ఎగుమతిలో ఆల్ టైం రికార్డు సృష్టించిందని, ఏకంగా 72% వృద్ధిని కనబరిచిందని అన్నారు.

ఇది అద్భుతమైన విజయమని ఆత్మనిర్భర్ భారత్ గురించి చాటిచెబుతుందని అన్నారు.

# వార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం

**- నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి**

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వార్డులో ప్రజలకు కావలసిన మౌళిక వసతులు కల్పిస్తామని నగర మేయర్ గోలగాని హరి వెంకట కుమారి తెలిపారు. బుధవారం ఆమె క్షేత్రస్థాయి పర్యటలో భాగంగా 5వ జోన్ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం ఉడా లే అవుట్, కరాస, శాంతినగర్, గౌరీ నగర్, ఎన్.ఎ.డి. కొత్త రోడ్డు, సంజీవయ్య కాలనీ తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ, డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తో కలసి పర్యటించారు. ముందుగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించి వార్డు ప్రజలందరూ స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో పాల్గొని మన విశాఖపట్నానికి మొదటి స్థానమే ధ్యేయంగా కృషిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ వార్డులోని పలు కాలనీలు పర్యటించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వార్డులోని సమస్యలను డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. ముఖ్యంగా వార్డులో మర్రిపాలెం ఉడా లే అవుట్ లోని గ్రీన్ బెల్టులో ఉన్న వాకింగ్ ట్రాక్ నిర్వహణ లేకపోవడంతో పాడౌతున్నందున దానిని ఆర్.డబ్ల్యు.ఎస్. వారికి ఇప్పించవలెనని, 310 సచివాలయంపై మొదటి అంతస్తు నిర్మించాలని, మర్రిపాలెం ఉడా లే అవుట్ నుండి ఎన్.ఎస్.టి.ఎల్. వరకు 60 అడుగుల రోడ్డును వెడల్పు చేయాలని, నేషనల్ హై వే నుండి మర్రిపాలెం ఉడా లే అవుట్ గుండా బి.ఆర్.టి.ఎస్. కు 60 అడుగుల రోడ్డును వెడల్పు చేయాలని, కరాస బరియల్ గ్రౌండ్లో లాకర్ రూమ్, వేచి వుండు గది, మంచినీటి సదుపాయం, విద్యుత్, కాలువలు శుభ్రత మొదలైన పనులు చేపట్టాలని, కరాస రామాలయం వద్ద పార్కు, శాంతి నగర్ పార్కు, గౌరీ నగర్ పార్కులో వాకంగ్ ట్రాక్, సుందరీకరణ పనులు అభివృద్ధి చేయాలని, మర్రిపాలెం ఉడా లే అవుట్ నుండి ఎయిర్ పోర్టు అధారిటీ స్థలం గుండా వచ్చే మురుగు నీటిని అనుసంధానం చేయుటకు, కోలనీ వాసులు ఎయిర్ పోర్టు అధారిటీ వారు అంగీకరించారని, మురుగునీరు పోవుటకు పనులు చేపట్టాలని, సంజీవయ్య కాలనీ,

కమ్యునిటీ హాలుపై మొదటి అంతస్తు నిర్మించాలని, గౌరీ నగర్, గణేష్ నగర్లో ప్రజలు వాడుతున్న మురుగు నీరు. రైల్వే స్థలం ద్వారా వెళ్ళవలసి ఉన్నందున రైల్వే అధికారులతో మాట్లాడి మురుగుపోయే మార్గం చూడాలని, వార్డులో రోడ్లు, కాలువలు శిథిలమైనందున వాటిని నూతనంగా నిర్మించాలని వార్డులో పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్నందున అదనంగా పారిశుధ్య కార్మికులను కేటాయించాలని, వార్డులో చాలా చోట్ల ఆక్రమణలు జరుగుతున్నందున వాటిని తొలగించాలని, మర్రిపాలెం ఉడా లే అవుట్లో ఇండోర్ కాంప్లెక్స్ నిర్మించాలని తెలుపగా మేయర్, కమిషనర్ స్పందిస్తూ, వార్డు అభివృద్ధి పథకంలో భాగంగా చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## సమయం

### కర్తవ్య పాలన

కర్తవ్యోన్ముఖులను గావించునది
ఋణమార్గంలో నడిపిస్తూ
గమ్యానికి చేర్చునది
అరిషడ్వర్గాలను లోబరుచుకొని
కోరికల గుర్రాలకు పగ్గాలు వేసి
శాంతి, అహింస, కరుణ, ప్రేమ
దైవిక గుణాలను అలవర్చునది
భక్తి కరదీపిక భగవద్గీత
ఇష్టదేవతా సాక్షాత్కార మొనరించునది
భక్తి, జ్ఞాన,యోగ మార్గములలో
జీవితానికి దివ్యత్వం ఒసంగునది
స్వస్వరూప సాక్షాత్కారం ప్రసాదించునది
సకల మానవాళికి కర్తవ్య పాలన దిశగా
నడిపించు దివ్య, పవిత్ర గ్రంథం భగవద్గీత

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : మాఘ ; తిథి : నవమి ఉ.11.52; రోహిణి తె.4.07; రా.వ.7.08ల 8.56.

**గురువారం**
**10-02-2022**

a **మేషం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం.మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.b **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. C **మిథునం** :ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. d **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కార మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. e **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. f **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహిం చటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. g **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. h **వృశ్చికం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమి కుల అత్యుత్సాహం అనర్థా లకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంత మంది మీ నుంచి ధనం లేక ఇతర్రతా సహా యం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. i **ధనుస్సు** : వృత్తి వ్యాపారు లకు అన్నివిధాలా అను కూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. j **మకరం** : ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్య లెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొం టారు. k **కుంభం** : దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విష యాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావల సిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. L **మీనం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతు లకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.


# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీన జాతి వాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్య వంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించినయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్న వాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరిం పచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవం తుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్న వాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా - సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ-భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి.

మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమానమైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.



# వీఆర్ఏల రిలే నిరాహార దీక్ష



అరకులోయ (విజయభానున్యూస్) : మండలంలో వీఆర్ఏలకు 21 వెయ్యి కనీస వేతనం చేయాలని అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని ఇచ్చిన డి ఎ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించాలని డి ఏ తో కూడిన జీతాలుఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న వారందర్నీ ఏ ఆర్ ఏ గా నియమించాలని...

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వీఆర్ఏలకు వర్తింపచేయాలని, 65 సంవ త్సరాలు దాటి చనిపోయిన వీ ఆర్ ఏ కుటుం బాల ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏల సమస్యలపై అరకు వ్యాలీ తాసిల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల ఆధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా...

వీఆర్ఏల యూనియన్ సంఘం అధ్యక్షులు న రాజీ అప్పారావు. దీక్షలు ప్రారంభించి మాట్లాడారు వీఆర్ఏ సమస్యలపై సీసీఎల్ఏ అధికారులు రాష్ట్ర కమిటీ తో చర్చలు చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి కొండు. శెట్టి గుండు. కే గోపన్న. ఎం. వెంకటరావు. కె సరోజిని. కె. మోతి. శెట్టి పైడితల్లి. శెట్టి బొజ్జా. బి.బుజ్జయ్య. వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో



భీమునిపట్నం (విజయభానున్యూస్) : భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 వ తరగతి చదువుతున్న 67 మంది పేద విద్యార్థినీ, విద్యార్థులకు స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో పరీక్షల ఫీజు, మరియు మెటీరియల్ నిమిత్తం ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చెక్ ను ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో...

పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సత్య నారా యణ, నాయుడు, లక్ష్మి, ఇతర సిబ్బంది, సభ్యులు వి లక్ష్మణరావు, ఎం శంకరరారావు, ఎన్.అశోక్ పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన శివప్రసాద్



ఆసుపత్రికి తరలించిన దృశ్యం

భీమునిపట్నం (విజయభానున్యూస్) : కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన కాకర రాంబాబు కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిసి అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త నేనుసైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శివప్రసాద్ వెంటనే రాంబాబుకు చికిత్స చేయించడానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలందిస్తున్నారు. ప్రాణాపాయంలో ఉన్న రాంబాబుకు వెంటనే ఒబి పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించడంతో శివప్రసాద్ అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి నుండి ఏర్పాటు చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రాణాపాయంలో ఉన్న అనేకమందిని ఆదుకుంటున్న శివప్రసాద్ పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్బీకే లో పంట రుణాలు పై అవగాహన

## మండల వ్యవసాయ అధికారి డి.అప్పారావు



నర్సీపట్నం (విజయభాను న్యూస్) : పంట రుణాల పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వ్యసాయాధి కారి డి .అప్పారావు తెలిపినారు . బుధవారం మండలలో గల బలిఘట్టం లో రైతు భోరోసా కేంద్రం పరిధి లో ఉన్న రైతులుకు అన్నదాత అజాద్ అమర్ మహోత్సమ కార్య క్రమం ను నిర్వహించడం అయినది.ఈ కార్యక్రమంలో రైతులకు ధాన్యం కొనుగోలు, అమ్మకం చేయడం వలన రైతులకు మేలు చేకూరుతుందని తెలిపినారు. పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని , ప్రతీ రైతు వారి వంతు బాధ్యత గా ఈ పంట సీజన్ వారి గా ప్రతి సర్వే నంబరు ను నమోదు చేసుకోవాలని తెలిపినారు. కార్య క్రమం లో 19 వార్డు కౌన్సిలర్ చినబాబు,యంపీఈఓ ప్రసాద్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ




భీమునిపట్నం (విజయభానున్యూస్) : గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధికి ఉపయోగ పడే 77 వేలు విలువ గల కుట్టు మిషన్లు మరియు స్టోరేజ్ రేకులను దివీస్ జీ ఎం ఎం ఎస్ ఎన్ రావు వై ఎస్ కోటేశ్వర రావు లు చిప్పాడ గ్రామీణ మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ రావు మాట్లా డుతూ మహిళలు స్వయం ఉపాధి లో ఆర్దికంగా పట్టుత్వాన్ని సాధించాలని అన్నారు. తమ శిక్షణా నైపుణ్య కేంద్రం ద్వారా దివీస్ వారు నిర్వహించిన కుట్టు మిషన్ లు కోర్సులో శిక్షణ పొంది తమ యొక్క సొంత టైలరింగ్ షాపును ప్రారంభించిన ఐదు గురు గ్రూప్ సభ్యులకు రెండు యాంత్రిక కుట్టు మిషన్ లు ఒకటి జీవర్ లాక్ మిషన్ రెండు అల్మారాలు దివీస్ యాజమాన్యం అందజేసినది అన్నారు.

వై ఎస్ కో టేశ్వర రావు మాట్లాడుతూ పరిసర ప్రాంత గ్రామీణ మహిళలు తమ ఆర్థిక ఇబ్బందులు అదిగ మించ డానికి మరియు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుటకు కావలసిన తోడ్పాటు ను దివిస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతి నిధులు డి.సురేష్ కుమార్ అశోక్, ఫణి, మరియు సుత్తమ్మ తల్లి టైల్ రింగ్ షాప్ ప్రతినిధి గంటా గౌరి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ అడ్వైసోరీ కమిటీ మెంబర్లుకు ట్రైకార్ ఛైర్మన్ అభినందనలు



పాడేరు, (విజయభానున్యూస్) : నూతనంగా నియమితులైన బి ఎస్ ఎన్ ఎల్ అడ్వైసోరీ కమిటీ మెంబర్లు బడ్డు సందీప్ ,ముద్దిలి త్రినాధ్ ,లను స్థానిక వైసిపి ఎం పి(అరుకు) మాధవి పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ సతక బుల్లిబాబు అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాడేరు మండల మాజీ అధ్యక్షులు కూడా సింహాచలం, ఎంపీటీసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్

## విభాగాధిపతిగా బాలప్రసాద్

ఆంధ్రాయూనివర్సిటీ (విజయభాను న్యూస్) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మేనేజ్ మెంట్ విభాగాధిపతిగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు ఎస్.బాల ప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో నియామక ఉత్తర్వులను ఆచార్య బాల ప్రసాద్కు అందజేసి అభినందించారు.



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులను స్వీకరిస్తున్న బాల ప్రసాద్

# ఘనంగా శ్రీపోలమాంబ అమ్మవారి ఉత్సవం



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం, జాజులవానిపాలెం గ్రామంలో శ్రీపోలమాంబ అమ్మవారి 14వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అందుకూరి సురేష్ పంతులు ఆధ్వర్యంలో పాలాభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. వైసిపి నాయకులు అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కాసు అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# లారీ ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమునిపట్నం, (విజయభానున్యూస్) : తగరపువలస హై వే లో ఉన్న పున్నమి రెస్టారెంట్ వద్ద మంగళవారం లారీని వేరొక లారీ ఢీకొన్న సంఘ టనలో వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం తగరపువలస బ్రిడ్జి దగ్గర ఉన్న పున్నమి రెస్టారెంట్ వద్ద హైవేపై ముందు ఇనుప ఊచలు లోడుతో వెలుతున్న లారీని వెనుక వస్తున్న ఇంటరావీటెన్ వెహికిల్ ఢీకొనడంతో ఆ వెహికిల్ నడుపుతున్న వ్యక్తి ముందుకు పడి రెండు బళ్ళు మధ్య ఇరుక్కుపోయి బలమైన గాయాలు తగలడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ హెటల్ లో పనిచేస్తున్న విజయ నగరం జిల్లా,డెంకాడ మండలం,కొండయ్య పాలెం గ్రామానికి చెందిన ఎర్నింటి పైడినాయుడు ఇచ్చిన వివరాలు ప్రకారం ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

# పారాగ్లైండింగ్ కు భీమిలి అనుకూలమైన ప్రదేశం

భీమునిపట్న, (విజయభాను న్యూస్) : పారాగ్లైండింగ్ కు భీమునిపట్నం అనుకూలమైన ప్రదేశమని మైలపిల్లి ప్రమోద్, త్రివేద్ లు అమెరికన్ పారాగ్లైండర్ లు అన్నారు. ఆమెరికా నుండి వచ్చి, గత నెల రోజులునుండి, పారాగ్లైండింగ్ చేస్తూ, ప్రభుత్వం పర్మిషన్ ఇప్పించినట్లయితే, అటు టూరిజం కి, ఇటు స్థానికులకి బాగుంటుందనే ఆలోచనతో ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ముత్తంశెట్టి. శ్రీనివాసరావును అమెరికన్ పారాగ్లైండర్ & మూర్తి చే మైలపల్లి ప్రమోద్ && వేద్ కలిసి ఈ వినతిపత్రం సమర్పించారు.

# జిల్లాల విభజన లో సడలింపులు లేవు : సబ్ కలెక్టర్

పాడేరు, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో నూతన జిల్లాల పునర్విభజనపై జనవరి26 తేదీన రాష్ట్ర ప్రభుత్వం వారి ద్వారా వెలువడిన గెజిట్ నోటిఫికేషన్ పై ఈనెల 9న సోషల్ మీడియా ద్వారా ప్రచారం కాబడుతున్న తాసిల్దార్ జి.మాడుగుల వారు చేసిన వ్యాఖ్యలపై సబ్ కలెక్టర్ వివరణ ప్రకటన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసి గెజిట్ నోటిఫికేషన్ తేదీ 26 జనవరి 2022న షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యం లోని ఆర్టికల్ 224 ద్వారా సంక్రమించిన ప్రత్యేక హక్కుల లో ఎటువంటి మార్పులు జరుగుటకు అవకాశం లేదని రిగ్యులేషన్ 1/70 ద్వారా భూ బదలాయింపు లో ఎటువంటి సడలింపులు లేవని ఓ ప్రకటనలో స్థానిక సబ్ కలెక్టర్ వి అభిషేక్ స్పష్టం చేశారు.

# సమస్యలు పరిష్కారం కోసం విఆర్ఏలు రిలే నిరాహార దీక్షలు



దీక్షలు చేపడుతున్న దృశ్యం

గొలుగొండ, (విజయభాను న్యూస్) : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు మండల కేంద్రమైన గొలుగొండతహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం 21 వేల రూపాయలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించి తమకు అన్యాయం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీఆర్ఏలకు వర్తింప చేయాలని అన్నారు.

# సిఎంను కలిసిన వైసీపీ సిఇసి సభ్యులు పైలా



పరవాడ (విజయభాను న్యూస్): విశాఖ శ్రీ శారదా పీఠం వార్షిక మహెూత్సవంలో భాగంగా విశాఖపట్నం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ని వైసిపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైల శ్రీనువాసురావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈకార్యక్రమంలో 85వ వార్డు కార్పోరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ తథితర్లు పాల్గోన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ పట్టివేత

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మండలంలో అనుమతులు లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్లనుమాకవరపాలెం తహశీల్దార్ రాణీఅమ్మాజి పట్టుకున్నారు.

అనంతరం వీటిని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.



పట్టుబడ్డ గ్రావెల్

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన తగరపువలస సంగివలస వద్ద జరిగింది. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం పి.ఎం పాలెం లాస్ట్ బస్ స్టాప్ లో నివాసంఉంటున్న బొబ్బిలి సత్యనారాయణ,మడ్డు రమేష్ విజయనగరం జిల్లా,మక్కువ గ్రామంలో సంబరానికి వెళ్లి తిరిగి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం పై వస్తుండగా సంగివలస మూడు గుళ్ళు సమీపంలో ఆగి ఉన్న లారీని వారు బలంగా ఢీకొనడంతో వారిద్దరికి బలమైన గాయాలయి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మడ్డు సత్యనారాయణ భార్య సంధ్య ఇచ్చిన వివరాలు ప్రకారం సిఐ జి వి రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ఆసుపత్రిలో

# తాగునీటి సమస్య పరిష్కారం

## ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కృష్ణారావు వెల్లడి



పాడేరు, (విజయభాను న్యూస్) : స్థానిక పాడేరు జిల్లా ఆసుపత్రిలో తాగునీటి సమస్యను పరిష్కరిం చామని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కృష్ణరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మోటారు పంపు ఒకరోజు మరమ్మతుల కు గురైందని వెంటనే కొత్త మోటారు అమర్చి తాగునీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి



సరఫరా కాని మందులను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల క్రిష్ణ సరఫరా చేస్తా మన్నామని చెప్పారని చెప్పారు. ముందుగా డయాలసిస్ ట్యాంకు కు నీటిని ఎక్కిస్తారని అది నిండిన తరువాత మిగిలిన విభాగాలకు నీటి సరఫరా చేస్తామని అన్నారు. మందుల కొరత లేదన్నారు.

# విజయవాడ నాగవంశ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : నాగవంశం కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం నాగవంశం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ బొడ్డు అప్పలనాయుడు అధ్యక్షతన విజయవాడ నాగవంశం కార్యవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం, రాష్ట్రం లో నూతనంగా ఏర్పాటు కానున్న జిల్లాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని జిల్లాలో నాగవంశీయుల అభివృద్ధి మరియు వారి సమస్యల పరిష్కారం కొరకు నాగవంశ సంక్షేమ సంఘాని జిల్లాలో మరింత బలోపేతం చేసేవిధంగా ప్రస్తుత నగర కమిటీ అధ్యక్షులు ఎరుబోతు రమణారావు, కార్యదర్శి కరుభుక్త రామకృష్ణ మరియు కార్యవర్గం సభ్యులతో కూడిన పాత కమిటీని రద్దు చేస్తూ విజయవాడ నాగవంశం పెద్దలు మరియు కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. అనంతరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను సమన్వయం చేసుకుంటూ నూతనంగా ఒక జిల్లా కమిటీని మరింత విస్తృతంగా అనుభవం గలవారును మరియు యువతను కలిపి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ పెద్దలు బొడ్డు అప్పలనాయుడు, ఎరుబోతు రమణారావు, తాలడ సూర్య నారాయణ, మద్దిల శ్రీనివాస్, నామల కాంతారావు, తమ్మిన దుర్గ, అప్పురుబోతు రాము, మరియు కార్యవర్గ సభ్యులు.

# రూ.1.80 లక్షలతో వాటర్ ట్యాంక్ కు మరమ్మతులు



ఆలమూరు (తూర్పు గోదావరి) : మండలంలోని జన్నాడలో మంచి నీటి సరఫరా ట్యాంక్ కు సుమారు రూ.1.80 లక్షలతో మరమ్మతులు చేపట్టగా బుధవారం సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ నాండ్ర నాగ మోహన్ రెడ్డిలు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ట్యాంక్ కాలమ్స్ శిథిలావస్థకు చేరాయన్నారు. వీటి మరమ్మతులు ఇంజనీరింగ్ అధికారుల సూచనల మేరకు ప్రతి స్థంభానికి నూతనంగా 12 అడుగులు ఎత్తు, మూడు అడుగుల వెడల్పుతో పటిష్ట నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సిబ్బందిని ఆదేశించారు.

# ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తున్న బీజేపీ : సీపీం

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : గత ఏడేళ్ల నుండి ఉత్తరాంధ్రను సర్వనాశనం చేసి ఇప్పుడు సమగ్రాభివృద్ధి పేరుతో బిజెపి 5 రోజులు ఉద్యమ కార్యచరణను ప్రకటించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉన్నది. రాష్ట్ర విభజనానంతరం, కేంద్రం పెట్టిన అన్ని బడ్జెట్లలో రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసింది.

దొంగే దొంగా... దొంగా అన్న చందంగా బిజెపే కార్యచరణ ఉన్నది. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదు. బిజెపి నాయకులకు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుండి రావల్సిన నిధులు కోసం పోరాడండి.

ఇప్పటి వరకు బిజెపి ఉత్తరాంధ్రకు చేసిన ద్రోహాలకు ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.

1) శ్రీకృష్ణ కమీషన్‌లో చెప్పినట్లు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రతి సంవత్సరం మౌళిక వసతులుకోసం రూ.150 కోట్లు ప్యాకేజీ అమలు చేయాలి. ఎందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించ లేదు?

2) ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు అమ్మాలని పంతంతో వున్నారు? లేదంటే మూసివేస్తామని ఎందుకు ప్రకటిస్తున్నారు?

3) ఉత్తరాంధ్ర వ్యవసాయ శస్యశ్యామలం కోసం పోలవరం ఎందుకు నిధులు కేటాయించకుండా ఇబ్బందులు పెడుతున్నారు? పైగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే నీటి ప్రాజెక్టులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

4) విభజన హామీలు ఉత్తరాంధ్రకు ప్రకటించిన గిరిజన యూనివర్సిటీ, ఐఐఎం, పెట్రోలియం యూనివర్సిటీకి నిధులు కేటాయించక నిర్మాణం చేపట్టకుండా కేంద్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుంది?

5) శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం కూలీలు వలసలు పోతున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఉపాధిహామీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాల్సిన నిధులు ఎందుకు తగ్గించారు?

6) విశాఖ రైల్వేజోన్ కోసం ఇటీవల కాలంలో పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావనలేదు? నిధులు ఎందుకు కేటాయించలేదు? విశాఖ రైల్వే డివిజన్ వుంటుందా? లేదా? రైల్వేజోన్‌లో ఈ ప్రాంత అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ ఉందా? లేదా? బిజెపి సమాధానం చెప్పాలి.

7) కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన చెరకు పాలసీ వల్ల ఉత్తరాంధ్ర షుగర్ ఫ్యాక్టరీలన్నీ మూతబడ్డాయి. ఈ కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీలను నిలువునా ముంచేసే చర్యలు చేపట్టి రైతాంగానికి తీవ్ర ద్రోహం చేశారు.

8) కేంద్ర విద్యుత్ సంస్కరణ బిల్లు వల్ల అనకాపల్లి, చీపురుపల్లిలో వున్న కో-ఆపరేటివ్ విద్యుత్ సంస్థలను ప్రభుత్వం ట్రాన్స్‌కోలో విలీనం చేసి రైతులకు, కార్మికులకు ద్రోహం చేయటం కాదా?

9) పట్టణ సంస్కరణల పేరుతో ఇంటి, చెత్తపన్ను పెంపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం ఎందుకు వత్తిడి చేస్తుంది?

10) ఉత్తరాంధ్రలో ప్రతి సందర్భంలో మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టి ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది మీరు కాదా?

11) విశాఖ మెట్రో రైలు నిర్మిస్తామన్నారు. బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదు?

ఉత్తరాంధ్రకు తీవ్రమైన ద్రోహంచేసి ఇప్పుడు ఉత్తరాంధ్రను రక్షిస్తామని పోజుపెట్టడం విజ్ఞులైన ఉత్తరాంధ్ర ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రకటనలు, కార్యాచరణలు మాని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో వుండేటట్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. లేనట్లయితే ప్రజా ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. బిజెపి 5 రోజులు ఉద్యమ కార్యచరణ కార్యక్రమాలను ప్రజలు నిలదీయాలని కోరుతున్నాం.

# పిల్లి సుభాష్‌ని పరామర్శించిన అరకు ఎంపీ మాధవి



సుభాష్‌ను పరామర్శిస్తున్న ఎంపీలు

కొయ్యూరు (విజయభాను న్యూస్) : అనారోగ్యంతో బాధపడుతున్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ని డిల్లీలో తన నివాసానికి వెళ్లి అరకు ఎంపి గొడ్డేటి మాధవి సహచర పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి, మార్గాని భరత్, డాక్టర్ సత్యవతితో కలిసి పరామర్శించారు. ఆయన అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని ఎంపీలు ఆకాంక్షించారు.

# ప్రజల సమస్యలపై పోరాడదాం



అచ్యుతాపురం (విజయ భాను న్యూస్):మండల సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం పూడిమడక కార్యదర్శి సిహెచ్ అప్పారావు అధ్యక్షతన మోసయ్యపేట కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ పూడిమడక పంచాయితీలో పరిశ్రమల వ్యర్థాలు వలన మత్స్య సంపద నాశనమై మత్స్యకారుల జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు . తీరప్రాంత కాలుష్యంకు పరిశ్రమల వ్యర్థాలు వలనే చేపలు చనిపోతున్నాయని ఆరోపించారు . దీనికి కారణమైన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్ ఈ జెడ్ పరిశ్రమల్లో పూడిమడక కార్మికులు అక్రమ తొలగింపులు ఆపాలని గత ఒప్పందం ప్రకారం ఇంటికొక ఉద్యోగం కల్పించాలని హామీని అమలు చేయాలని, పెండింగ్ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలన్నారు . అచ్యుతాపురం మోసయ్యపేట రోడ్డు విస్తరణ పనుల్లో ఇల్లులు, షాపులు, స్థలాలు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని పునరావాసం కల్పించాలని, రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోతున్న చిల్లర వర్తకులు, దుకాణ సముదాయం అద్దెలకు వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి 2016 వీధివ్యాపార చట్టం అమలు చేయాలన్నారు . జగనన్న ఇళ్ల నిర్మాణాల్లోఉన్న ఇళ్లస్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూ%శీ%ద్రపు సోము నాయుడు ,బొడ్డేడా. రామ్ కుమార్, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చిత్ర పరిశ్రమకు రాయితీలు కల్పించాలి



రాజమహేంద్రవరం (విజయ భాను న్యూస్): ఆంధ్ర ప్రదేశ్‌లో సినిమా రంగాన్ని మరింతగా ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించ డంతో పాటు కళాకారు లకు సౌకర్యాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని నవ్యాంధ్ర ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఎస్‌విఎన్ రావు కోరారు. ఎపిలో సినిమా టిక్కెట్ల ధరలను తగ్గిస్తూ ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇంకా హైదరాబాద్‌లోనే ఉన్న సినిమా ఇండిస్ట్రీని ఎపిలోకి త్వరితగతిన తీసుకుని వస్తే ఇక్కడ సినిమాల చిత్రీకరణ, కళాకారులకు మరింతగా ప్రోత్సాహం లభించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ఎదుట వీధిలో ఉన్న నవ్యాంధ్ర ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆర్గనైజర్ కర్రి సూర్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా మంది చిన్న నిర్మాతలు సినిమాలు తీసేందుకు ఉత్సాహం చూపుతు తన్నారని అటువంటి వారికి మరింతగా ప్రభుత్వం ద్వారా షూటింగ్‌లకు రాయితీలు, ప్రోత్సాహలు ఇవ్వాలని సిఎం జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణాలో ఇటీవల సినిమా టిక్కెట్ల ధరలను చాలా వరకు పెంచారని, కుటుంబంలో సినిమాకు వెళితే రూ.15 వందల వరకు ఖర్చవుతోందన్నారు. అటు వంటి నిర్ణయాలు ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని కోరారు. థియేటర్లలో చిత్రాలు విడుదల చేయడానికి వీలు లేక పోవడంతో ఒటిటి ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. దాని వల్ల ఏడాదికి రూ.350 చెల్లించడం ద్వారా వెయ్యి సినిమాల వరకు చూసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. షార్ట్ ఫిల్మ్ తీసి యు ట్యూబ్‌లో ప్రదర్శిస్తున్నప్పటికీ వారికి ఎటువంటి ఉపయోగం ఉండటం లేదన్నారు. టెక్నీషియన్లు, కళాకారులు చాలా రంగాల్లో ఆసక్తి ఉన్నవారు ఇక్కడ అధికంగా ఉన్నారని వారికి సరైన మార్గం లేదని అందువల్లనే వారికి సహకరించేందుకు ఈ నవ్యాంధ్ర ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ప్రారంభించడం జరిగిందని వివరించారు. మాజీ కార్పొరేటర్ మానే దొరబాబు మాట్లాడుతూ కళాకారులకు మంచి గుర్తింపు వచ్చేందుకు యూనియన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ సినిమా షూటింగ్‌లు జరుగు తాయని, రాజ మహేంద్రవరంలో ఒక్క షాట్ అయినా తీయాలనే సెంటిమెంట్‌ను చాలా మంది డైరెక్టర్లు పాటిస్తున్నారన్నారు. యూనియన్ ద్వారా కళాకారులకు మరిన్ని అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. ఫైట్ మాస్టర్ అశోక్ రాజు, ఆర్గనైజర్ కర్రి సూర్య నాయుడు మాట్లాడుతూ సినిమా రంగంలోకి 28 క్రాఫ్ట్‌లోని అందరికి అవకాశాలు వచ్చేలా చేయడంతో పాటు వారిని యూనియన్‌లో చేరేలా ప్రోత్సహిస్తామన్నారు.

# పారిశ్రామిక యూనిట్లకు ప్రోత్సాహకాలు



కాకినాడ (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లాలో పారిశ్రామిక అభివద్ధి విధానాలు (2015-20, 2020-23), వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 84 ఎంఎస్ఎంఇ యూనిట్లకు వివిధ రకాల ప్రోత్సాహకాలు కింద రూ.5.05 కోట్ల మంజూరుకు ఎస్‌విసికి సిఫార్సు చేశామని కలెక్టర్ సి.హరికిరణ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కోర్టుహాల్లో కలెక్టర్ అధ్యక్షతన 12వ జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమలకు అనుమతులు, ప్రోత్సాహకాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గత నవంబర్ 30న జరిగిన సమావేశ తీర్మానాల అమలు, కార్యాచరణ ప్రణాళికలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు 194 దరఖాస్తులకు 138 ఆమోదం పొందాయన్నారు. మిగిలిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, రంపచోడవరం, వై.రామవరం మండలాల్లో 61 వన్ ధన్ వికాస కేంద్రాలకు రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ.9.15 కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. వీటిని పిఎంఇజిపితో అనుసంధానించాలని సూచించారు. బ్యాంకు రుణాలు సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర పరిశ్రమ సర్వే ఇప్పటికే 4,047 యూనిట్లకు పూర్తయిందని, మిగిలిన వాటి సర్వేను కూడా త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జాతీయ హరిత ట్రైబ్యునల్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ ఉత్తర్వుల మేరకు పట్టణ ప్రాంతాల్లోని నివాస అపార్టుమెంట్లు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, ప్రభుత్వ నీటి సరఫరా ఏజెన్సీలు, ప్యాకేజ్డ్ తాగునీటి యూనిట్లు వంటివాటితో పాటు ప్రస్తుతమున్న, నూతన పరిశ్రమలు, మౌలికవసతులు, మైనింగ్ ప్రాజెక్టులు తదితరాలు భూగర్భ జలాల వినియోగానికి తప్పనిసరిగా నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్‌ఒసి లేని వారు 2022, మార్చి 31లోగా సిజిడబ్ల్యూఎకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామీణ తాగునీటి సరఫరా పథకాలు, రోజుకు 10 క్యూబిక్ మీటర్ల కంటే తక్కువగా తీసుకునే సూక్ష్మ, చిన్న సంస్థలు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

# సీఎం జగన్ శారదపీఠం సందర్శన దృశ్యమాలిక





శారదపీఠం వారోత్సవాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మిలీనియం శ్రీధర్ రెడ్డి



















విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవంలో భాగంగా పీఠానికి చేరుకున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి రాజ శ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాస్వామి వారి ఆశీస్సులను గైకొన్న విశాఖపట్నం ప్రముఖ న్యాయవాది చెన్నా శరత్ బాబు. అనంతరం రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు.

# రాజశ్యామలకు సీఎం జగన్ ప్రత్యేక పూజలు







పీఠం ప్రాంగణంలోని చంద్రమౌళీశ్వరులకు సీఎం అభిషేకం చేసారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు సీఎం. అలాగే లోక కళ్యాణార్థం విశాఖ శ్రీ శారదాపీఠం నిర్వహించిన రుద్రహోమం పూర్ణాహుతికి హాజరయ్యారు. ఆతర్వాత రాజశ్యామల అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కొద్దిసేపు పీఠాధిపతులతో వైదిక పరమైన అంశాలను చర్చించారు.

### మహా విద్యాపీఠం విశాఖ శారదాపీఠంబీ స్వాత్మానందేంద్ర స్వామి

జగద్గురు శంకరాచార్య సాంప్రదాయ పీఠంగా ఆవిర్భవించిన విశాఖ శ్రీ శారదాపీఠం ఇపుడు మహా విద్యాపీఠంగా అవతరించిందని పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి స్పష్టం చేసారు. పీఠం నిర్వహణలో 21 సంవత్సరాల క్రితం ఏర్పాటైన జగద్గురు శంకారాచార్య వేద పాఠశాల ఎందరో వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. తమ వద్ద పట్టాలు పొందిన వారు దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గడిస్తుండటం ఆనందాన్నిస్తోందన్నారు. వేదానికి పుట్టినిల్లుగా పేరున్న ప్రాంతంలో ఏర్పడిన తమ వేద పాఠశాల తెలుగు రాష్ట్రాల్లోనే మంచి పేరును సంపాయించిందన్నారు. తమ పీఠ పరంపరకు 200ఏళ్ళ చరిత్ర ఉందని వివరించారు. హెూళె నర్సిపూర్ కేంద్రంగా పరంపర మొదలైందని తెలిపారు. విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహెూత్సవాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరై రాజశ్యామల అమ్మవారి ఆశీస్సులు అందుకోవడం ఆనవాయితీగా పాటిస్తున్నారని, వరుసగా 8ఏళ్ళుగా క్రమం తప్పకుండా వస్తున్నారని తెలిపారు.

వార్షిక మహెూత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పీఠానికి తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్,శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి,మంత్రులు అవంతి శ్రీనివాస్, వెల్లంపల్లి శ్రీనివాస్, రంగనాథ రాజుతో పాటు అనేక మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వీకే పి సీ పి ఐ ఆర్ చైర్ పర్సన్ చొక్కాకుల లక్ష్మీ వెంకట రావు, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, ఉత్సవాల్లో పాల్గొని దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు.







విశాఖ శ్రీ శారదాపీఠం వార్షిక మహెూత్సవములలో పాల్గొనడానికి విశాఖపట్నం శ్రీ శారదాపీఠంకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు మర్యాద పూర్వకంగా కలిశారు.











VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com